# విచిత్ర కథలు

-సౌభాగ్య



ఒక వూళ్ళో కొత్తగా పెళ్ళయిన దంపతులు వుండేవాళ్ళు. వాళ్ళెంతో అన్యోన్యంగా జీవించేవాళ్ళు. భర్త పొలం పనులకు వెళితే భార్య యింటి పనులు చూసేది. యింటి వెనక కూరగాయలు పండించేది. సాయంత్రం వంటా వార్పూ అయ్యాక దీపం వెలిగించేది. పాత కాలంలో కరెంటు వుండేది కాదు కదా! ఆ దీపం వెలుగులో ఇల్లంతా నిర్మలంగా నిగనిగలాడేది.

భర్త పేరు రాముడు. భార్య పేరు సీత. సీతకు ఎవరికీ తెలియని ఒక కథ తెలుసు. ఐతే ఆమె ఆ కథను ఎవరికీ చెప్పలేదు. ఆమెకు ఒక మంచి పాట తెలుసు. కానీ యిప్పటిదాకా ఆమె ఆ పాటను పాడింది లేదు. ఇలా కొంతకాలం గడిచింది. ఎవరికీ చెప్పకపోవడంవల్ల, ఎప్పుడూ పాడకపోవడంవల్ల ఆ కథ, ఆ పాట ఆమె లోపలే వుండిపోయాయి. ఆమె లోపలే వుండిపోవడంవల్ల వాటికి వూపిరాడక అల్లాడియాయి. బయటికి రాలేక ఉక్కిరి బిక్కిరయ్యాయి.

ఒక రోజు మధ్యాహ్నం సీత వంట చేసి భోంచేసి చాప వేసుకుని పడుకుంది. బయట నించీ వచ్చిన చల్లగాలికి

# దీపం చెప్పిన కథ

క్షణంలో నిద్రలోకి జారుకుంది. నిద్రలోకి వెళ్ళేముందు పెద్దగా ఆవులించి పడుకుంది. ఎన్నాళ్ళగానో ఆమె కడుపులో వుండి వూపిరాడక అల్లాడిపోతున్న కథ, పాట ఒక్కసారిగా బయటపడి స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకున్నాయి.

సీత నోట్లోంచి బయటపడిన కథ ఒక్కసారిగా యింటి వరండాలోకి వచ్చి చెప్పుల జతగా మారిపోయింది. పాట ఒక కోటుగా మారి చిలక్కొయ్యకు వేలాడుతూ వుండిపోయింది.

సాయంత్రానికి పొలం పనులు ముగించుకుని వచ్చిన రాముడు యింట్లోకి రాబోతూ తలుపు ముందున్న చెప్పుల జత చూశాడు. ఎవరో యింట్లో వున్నారనుకుని యింట్లోకి వచ్చాడు. ఎవరూ లేరు. సీత ఒక్కతే వుంది. అప్పటికే నిద్ర లేచి బియ్యం ఏరుకుంటూ కనిపించింది. చిలక్కొయ్యకు వేళ్ళాడుతూ కోటు కనిపించింది. రాముడు 'మన ఇంటికి ఎవరన్నా వచ్చారా?' అని అడిగాడు. సీత 'ఎవరూ రాలేదే' అంది. రాముడు 'మరైతే ఆ చెప్పులు, కోటు ఎవరివి?' అన్నాడు. ఆమె వాటిని చూసి 'అవి ఎలా వచ్చాయో నాకు తెలీదు' అంది. రాముడికి మనసులో అనుమానం ఎక్కువైంది. వాటి గురించి పదే పదే అడిగాడు. ఎన్నిసార్లు అడిగినా సీత నాకు తెలీదు అంది. ఇదరూ బాగా ఘర్షణ పడ్డారు.

రాముడు కోపంగా చాపా దిండూ తీసుకుని దగ్గర్లోని ఆంజనేయ ఆలయానికి వెళ్ళి పడుకున్నాడు. సీత ఏడుస్తూ రాత్రి ఒంటి గంటకి దీపం ఆర్పి పడుకుంది. ఆ వూళ్ళో దీపాలన్నీ రాత్రి పది గంటలకి ఆంజనేయుని గుడిలో చేరి వూరి విశేషాలు ముచ్చటించుకుంటాయి.

రామయ్య ఇంట్లో దీపం రాత్రి ఒంటిగంటకి గుడి చేరింది. అన్ని దీపాలూ 'ఎందుకింత ఆలస్యం' అని అడిగాయి. రామయ్య ఇంటి దీపం 'మా యింట్లో పెద్ద గొడవ జరిగింది. అందుకని నేను రావడం ఆలస్యమైంది' అంది. ఏమిటి విశేషం అని అన్నీ అడిగాయి.

'మా యజమానురాలికి ఒక కథ, ఒక పాట తెలుసు. ఐతే యిప్పటిదాకా ఆమె ఆ కథ ఎవరికీ చెప్పలేదు. పాటా పాడలేదు. ఆమె కడుపులో వుండిపోయిన అవి ఆమె నిద్రకు ఆవులిస్తే ఇన్నాళ్ళకు బయటపడి చెప్పులుగా, కోటుగా మారిపోయాయి. మా యజమాని వాటిని చూసి ఇంటికి ఎవరొచ్చారో చెప్పు' అని అడిగాడు. ఆమె 'ఎవరూ రాలేదంది'. గొడవ పడి అతను యిదిగో యిక్కడే పడుకున్నాడు. ఆమె ఏడుస్తూ రాత్రి ఒంటి గంటకి గానీ నిద్ర పోలేదు. అందుకు ఆలస్యం అయింది అంది.

నిద్ర పోకుండా ఆలోచిస్తున్న రాముడు యిదంతా విని భార్యని అనవసరంగా సందేహించానని యింటికి వెళ్ళి భార్యను క్షమించమని కోరాడు.

★

**రాముడు 'మన ఇంటికి ఎవరన్నా వచ్చారా?' అని అడిగాడు. సీత 'ఎవరూ రాలేదే' అంది. రాముడు 'మరైతే ఆ చెప్పులు, కోటు ఎవరివి?' అన్నాడు. ఆమె వాటిని చూసి 'అవి ఎలా వచ్చాయో నాకు తెలీదు' అంది. రాముడికి మనసులో అనుమానం ఎక్కువైంది. వాటి గురించి పదే పదే అడిగాడు. ఎన్నిసార్లు అడిగినా సీత నాకు తెలీదు అంది. ఇదరూ బాగా ఘర్షణ పడ్డారు.**